క్లుప్తంగా

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందిస్తున్న నాయకులు

మునగపాక: రాయితీపై రైతులకు విత్తనాలు అందజేస్తున్నట్లు గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేట రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, కృష్ణారావు, బీవీ రమణ, సూరిశెట్టి రాము, రామ జోగినాయుడు, వీఏఏ శ్వేత మీనస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేడుకగా 108 కలశాలతో సాయిబాబా ఊరేగింపు



108 కలశాలతో ఊరేగిస్తున్న భక్తులు

పాయకరావుపేట: పట్టణంలోని బృందావనంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవాలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం 108 కలశాలతో సాయిబాబా ఉత్సవ విగ్రహం ఊరేగింపు కనువిందుగా సాగింది. సాయిబాబాకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, హారతులు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ట్రిపుల్ ఐటీకి రైతు బిడ్డ



ఎడ్ల పూజిత

యలమంచిలి రూరల్: మండలంలోని పీఎస్ఆర్ పేట గ్రామానికి చెందిన ఎడ్ల పూజిత శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. 10వ తరగతిలో 598 మార్కులు సాధించిన పూజిత ఏటికొప్పాక సాధన స్కూల్‌లో చదువుకుంది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన పూజిత ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల ఆమె తండ్రి ఎడ్ల నానాజీ, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు.

క్వారీ తెరవద్దంటూ ఆందోళన



క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న జీ.కోడూరు రైతులు

మాకవరపాలెం: పంటలకు నష్టం కలిగించే క్వారీ తెరవద్దంటూ జీకోడూరు గ్రామానికి చెందిన దళిత రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని జీకోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో గతంలో నల్లరాతి క్వారీ నిర్వహించేవారు. మరలా ఈ క్వారీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారని చుట్టుపక్కల గల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారంతా క్వారీ వద్ద ఆందోళన చేశారు. క్వారీ నిర్వహిస్తే బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు పడి తమ జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. అధికారులు స్పందించి క్వారీని ప్రారంభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులు వినూత్న నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

నర్సీపట్నం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శిబిరం నుండి ర్యాలీగా వెళ్లి అబిద్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి వీడి ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు.

చినుకు పడితే చిత్తడే!

చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిగా తయారవుతున్నాయి. కాలువల్లో మురుగునీరు ప్రవహించక వీధులన్నీ కంపుకొడుతున్నాయి. ప్రజలు అడుగుతీసి అడుగు వేయాలంటే ఎక్కడ జారిపడతామోనని భయపడిపోతున్నారు. పారిశుధ్యం అధ్వానంగా మారడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. పాలకులు పట్టించుకోకపోవడంతో మునగపాక మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



:బురదమయంగా ఇందిరమ్మ కాలనీ ప్రధాన రోడ్డు

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలు గాలికి..



అధ్వానంగా దర్శనమిస్తున్న మునగపాక జగనన్న కాలనీ ప్రధాన రహదారి

మునగపాక: అధికారంలోకి వస్తే గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తామంటూ ఎన్నికల ముందు ఊకదంపుడు ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గుంతలు లేని రహదారులే లక్ష్యం అంటూ గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా అతీగతీ లేదు. నేటికీ గ్రామీణ రహదారులు అధ్వానంగానే దర్శనమిస్తున్నాయి. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఇప్పుడు పెదవి విరుస్తున్నారు. వర్షం పడితే చాలు పల్లె రోడ్లు బురదమయంగా తయారవుతున్నాయి.

జగనన్న కాలనీ రోడ్డు దయనీయం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. కేటాయించిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో నేడు పలు చోట్ల ఊళ్లుగా మారాయి. అయితే ఆ కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించే క్రమంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంత వరకు జగనన్న కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ప్రధాన రహదారులను కనీసం అభివృద్ధి చేయలేకపోయారు. దీంతో కాలనీకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. మునగపాక జగనన్న కాలనీ ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితులను నెలకొన్నాయి.



యాదగిరిపాలెంలో గోతుల్లో నిలిచిపోయిన వర్షపు నీరు

అభివృద్ధికి నోచుకోని వాడ్రాపల్లి–తిమ్మరాజుపేట రోడ్డు

తిమ్మరాజుపేట-వాడ్రాపల్లి రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ఇరు గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉండేలా దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు గ్రావెల్‌తో రహదారి సదుపాయం కల్పించారు. అయితే వర్షాకాలంలో గ్రావెల్ రోడ్డు బురదమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే యాదగిరిపాలెం రోడ్డు కూడా గోతులమయంగా తయారైంది. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందవుతోంది.

బురదమయంగా ఇందిరమ్మ కాలనీ రోడ్డు

ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మునగపాక ఇందిరమ్మ కాలనీ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొద్ది పాటి వర్షం కురిసినా కాలనీ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధాన రహదారి బురదమయంగా దర్శనమిస్తోంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరిచి ప్రయాణించినా జారిపడుతున్న సంఘటనలు ఉన్నాయి. అధికారులు, పాలకులు స్పందించి కనీసం ప్రధాన రహదారినైనా అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పక్కా రోడ్డు నిర్మాణం అవసరం



ఇందిరమ్మ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయంగా ఉంటుంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పాలకులు, అధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి.

– కొణతాల సంతోష్‌కుమార్, ద్విచక్ర వాహనదారుడు, మునగపాక

పల్లె రహదారులపై నిర్లక్ష్యం



యోగాంధ్ర పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధిపై నిర్లక్ష్యం చూపుతోంది. పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షాకాలంలో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలి.

– గనిశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ ఉపాధ్యక్షుడు


ప్రభుత్వానికి నివేదికలు

గ్రామీణ రహదారుల అభివృద్ధికి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. రెండో విడతలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఎక్కడెక్కడ రహదారుల నిర్మాణం అవసరమో గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– గులామ్, మండల ఇంజినీరింగ్ అధికారి

జగన్నాథుని నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- మునగపాకలో ఘనంగా రాట మహోత్సవం
- తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు



మునగపాకలోని బలరామ సుభద్ర సమేత జగన్నాథస్వామి

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో బలరామ సుభద్ర సమేత జగన్నాథుని నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి జూలై 6వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. మునగపాకలోని జగన్నాథుని రథయాత్రను శుక్రవారం ఘనంగా ప్రారంభించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజుల పాటు జగన్నాథుడు పలు రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



జగన్నాథుని రాట మహోత్సవంలో భక్తులు

భక్తిశ్రద్ధలతో రాట మహోత్సవం

మునగపాక జగన్నాథుని రాట మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథుని ఆలయ ప్రాంగణంలో వేప చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య రాట వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొడ్డేడ జగ్గారావు, విల్లూరి జగన్నాథం, పాలమరశెట్టి అప్పలనాయుడు, వెలగా వెంకటప్పారావు, ఆడారి జగ్గారావు, ఆడారి బాపునాయుడు, కాండ్రేగుల జగ్గప్పారావు, మహేశ్వరి, రాము, తదితరులు పాల్గొన్నారు.

నేడు మునగపాకలో ఉచిత వైద్య శిబిరం

మునగపాక: మునగపాకలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దాడి సాంబశివ, టెక్కలి దేవకీరావు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. గణేష్ బెస్ట్ మార్కెట్, గణేష్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో అచ్యుతాపురానికి చెందిన శ్రీ విష్ణు పోలీక్లినిక్ వైద్యులు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

యలమంచిలి రూరల్: యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు అధ్యాపకులు అవసరమని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 50 శాతం మార్కులతో పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

విస్తారంగా కూరగాయల సాగు

కోటవురట్ల: రైతులు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. ఏడాది పొడవునా వివిధ పంటలను సాగు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో పలువురు రైతులు కూరగాయల సాగుతో మంచి ఫలితాలను సాధిస్తున్నారు. ఏడాదంతా కూరగాయల సాగుతో ముందుకు సాగుతున్నారు. మండలంలో జల్లూరు, యండపల్లి, లింగాపురం తంగేడు, కొడవటిపూడి, కె.వెంకటాపురం, చినబొడ్డేపల్లి, అన్నవరం తదితర ప్రాంతాలలో రైతులు ఎక్కువగా కూరగాయల సాగు చేస్తున్నారు. టమాటా, బెండ, మిర్చి, కాకర, దొండ, బీర తదితర పంటలను పండిస్తున్నారు. విత్తు నాటాక మూడు నెలల పరిధిలో ఆదాయాన్ని చవి చూస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.10 వేలు ఖర్చు కాగా రూ. 30 వేలు వరకు ఆదాయాన్ని పొందుతున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు రావడంతో పలువురు రైతులు ఎక్కువగా కూరగాయల సాగుకే మొగ్గుచూపుతున్నారు.



టమాటా పంట

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం.. రూ.10 లక్షల ఆస్తి నష్టం

- ఆభరణాలు, నగదు, సామగ్రి దగ్ధం
- తమ్మయ్యపాలెంలో ఘటన



కాలిపోయిన సామగ్రిని చూపిస్తున్న బాధితులు పైడమ్మ, కోటేశ్వరరావు దంపతులు



కాలిపోయిన నగదును చూపిస్తున్న బాధితులు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం శివారు తమ్మయ్యపాలెంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టంతో పాటు పట్టాదార్ పాస్ పుస్తకాలు వంటి విలువైన డాక్యుమెంట్లు కాలిబూడిదయ్యాయి. అధికారులు, బాధితులు తెలిపిన వివరాలు..

గ్రామానికి చెందిన జోగ పైడమ్మ, కోటేశ్వరరావు దంపతులు వ్యవసాయంతో పాటు, గాజువాకలో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. వారికి వివాహాలయ్యాయి. కుమారుడు భార్యతో కలిసి ఇంట్లోని కింది పోర్షన్‌లో ఉండగా, బాధిత దంపతులు మేడపైన షెడ్‌లో ఉంటున్నారు. వ్యాపారం కోసం గాజువాక వెళ్లాల్సి ఉండగా గురువారం ఉదయం పైడమ్మ టీ కాచేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఆమె బయటకు పరుగులు తీసింది. విషయం కొడుకు, కోడలికి తెలియడంతో, వారు పైకొచ్చేసరికి మంటలు పూర్తిగా వ్యాపించి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసింది. ఈ ప్రమాదంలో మనవరాలికి సారె పెట్టేందుకు తెచ్చి ఉంచిన రూ.4 లక్షల నగదు, 4 తులాల బంగారు అభరణాలు, 20 బస్తాలు ధాన్యం, 10 కోళ్లు, 150 కిలోల వరకూ బొబ్బర్లు, మినుములు వంటి తృణ ధాన్యాలు, గృహోపకరణాలు, దుస్తులతోపాటు, విలువైన డాక్యుమెంట్లు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.10 లక్షల వరకూ ఆస్తినష్టం ఉంటుందని చెప్తున్నారు. మనవరాలికి సారె పెట్టేందుకు మూడు రోజుల క్రితమూ బంగారు అభరణాలు, నగదు బ్యాంకు నుంచి తెచ్చి ఇంట్లోని ట్రంక్ పెట్టెలో పెట్టినట్లు బాధితులు రోదిస్తూ చెప్పారు. కూరగాయల వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటూ రూపాయి రూపాయి పోగుచేసుకున్న సొమ్ము బుగ్గిపాలైందని పైడమ్మ బోరున విలపించింది. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేసింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ చిన్నికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలను సేకరించారు. బాధితులకు బియ్యం, దుస్తులు వంటి నిత్యావసర సరకులు అందించారు. ప్రమాదంపై కలెక్టర్‌కు నివేదిక అందించి, ప్రభుత్వం తరఫున ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు వంటి కాలిపోయిన డాక్యుమెంట్లు పునరుద్ధరించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వీఆర్వో డి.దేముడు బాబు, మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు, గ్రామ పెద్దలు ఉన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పెంటకోటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మడుతూరు ఎంపీపీఎస్ హెచ్ఎం సరళ, ఉపాధ్యాయులు

యలమంచిలి రూరల్: మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ అన్నారు. గురువారం సాయంత్రం యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పలు కళాశాలల విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో విద్యార్థులు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వద్దంటూ ప్రతిజ్ఞ చేయించారు.అంతకు ముందు పట్టణంలోని ప్రధాన రహదారిలో విద్యార్థులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు మాదక ద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయరావు, పట్టణ ఎస్ఐ కె.సావిత్రి, వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని పెంటకోట జెడ్పీ హైస్కూల్‌లో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పెంటకోట మెరైన్ సీఐ వై.మురళీరావు కోరారు. డ్రగ్స్ నివారణ, సహాయక చర్యలో టోల్ ఫ్రీ నంబరు 1972 ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె.సూర్యనారాయణ, ఎస్ఐ డి.రత్నశేఖర్, ఏఎస్ఐ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో నషాముక్త్ అభయాన్ ర్యాలీ



నక్కపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

నక్కపల్లి: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు వాటి వల్లే కలిగే అనర్థాలను ప్రజలకు వివరించేందుకు విద్యార్థులు కృషి చేయాలని తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి, సీఐ కుమార స్వామి పిలుపునిచ్చారు. గురువారం నక్కపల్లిలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నషాముక్త్ అభయాన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఉపమాక రోడ్డు జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన ఎంతో మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు, మానసిక సమస్యలను ఎదుర్కొనే అవగాహన లేకపోవడం వల్ల మత్తు పదార్థాలకు అలవాటుపడుతున్నారన్నారు. ఈ ర్యాలీలో సీఐ సన్నిబాబు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

అచ్యుతాపురం రూరల్ : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని మెరైన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సింహాద్రినాయుడు అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పూడిమడక పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు సేవిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మడుతూరు ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళ మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆరోగ్యకరమైన జీవనం సాగించాలన్నారు. మెరైన్ ఎస్ఐ పైడిరాజు, బీహెచ్‌వీఎస్ఎన్ రాజు, సిబ్బంది కన్నం నాయుడు, ఉపాధ్యాయులు అప్పలరాజు, రాజేశ్వరి, రెహమాన్ పాల్గొన్నారు.



డ్రగ్స్ నిర్మూలనపై పూడిమడకలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

29న శ్లోకాల కంఠస్థ పోటీలు

అనకాపల్లి టౌన్: వేల్పులవీధి దత్త మందిరంలో ఈ నెల 29న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు జరుగనున్నాయని భగవద్గీత సమితి గౌరవాధ్యక్షుడు కడ్మిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. భగవద్గీతలో 13వ అధ్యాయం శ్లోకాలపై కంఠస్థ పోటీలు జరగుతున్నాయని, ఆసక్తి గల వారు ఇప్పటికే భగవద్గీత అభ్యాసం చేసిన యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.